
# ది గేమ్

అమళ్ళదిన్నె పద్మజాశర్మ

మధ్యాహ్నం మూడు గంటల సమయం. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఎండ విపరీతంగా ఉంది.

ఎండ తీవ్రతకి మొహం కందిపోయినట్టుగా ఎఱ్ఱగా అయిపోగా నీరసంగా ఆ బడ్డీ కొట్టు ముందు ఉన్న బెంచీమీద కూలబడ్డాడు రవీంద్ర.



చుట్టుపక్కల ఎక్కడా కనుచూపు మేరలో ఏ చెట్లూ లేవు. కొట్టు కూడ అది ఒక్కటే అక్కడ. షాపు ఓనరు కొట్టు ముందర కట్టి ఉన్న గోనె సంచుల మీద నీళ్ళు బాగా కొడుతున్నాడు. అయినా కూడ లోపల ఉక్కపోతగానే ఉంది.

షాపులో ఏదో పుస్తకం చదువు కుంటూ అపుడపుడూ దాంతోనే విసురుకుంటూ కాలక్షేపం చేస్తున్న ఓనరు, రవీంద్ర కూర్చున్న అలికిడికి తలెత్తి ఓసారి చూసి మళ్ళీ చదువు కోవటంలో మునిగి పోయాడు.

కూర్చుంటూ "మంచి నీళ్ళు అడుగుదామా" అనుకున్నాడు. మళ్ళీ అతని చదువుకి అంతరాయం ఎందుకులే అని మానుకుని తను కూడ చేతిలో ఉన్న ఫైల్‌తో విసురు కోవటం మొదలెట్టాడు.

ఇంటికి వెళ్ళాలంటే కనీసం యింకో మైలు అన్నా నడవాలి. ఆ రూట్‌కి డైరెక్ట్ బసస్ లేవు. రెండు బస్‌లు మారి వెళ్ళాలి. పోనీ ఏ ఆటోలోనో వెళ్దామంటే ప్రస్తుతం అతనికి అంత స్తోమత లేదు.

రవీంద్ర ఒక నిరుద్యోగి. నిన్నటి వరకు చిరుద్యోగి. కొన్ని ప్రైవేట్ సంస్థల్లోని ఉద్యోగాల్లాగే అది కూడ చాలా కాలం నిలవలేక పోయింది. రవీంద్ర కుటుంబం మధ్య తరగతికి చెందినది. ఇంటికి పెద్దగా పుట్టినవాడు అతడే. నడుం విరిగిపోయే బరువులు లేవు. కానీ కొన్ని బాధ్యతలు మటుకు ఉన్నాయి. ప్రస్తుతం మంచి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు.

ఆలోచనల్లో మునిగి పోయిన అతనికి వడగాలి వచ్చి విసురుగా తగిలేసరికి ఇహ లోకం లోకి వచ్చి పడ్డాడు. విపరీతమైన దాహం అన్పించింది.

"మంచినీళ్ళు బదులు సోడానే తాగితే పోతుంది: అతనికి అంతరాయం అన్పించదు" తనలో తనే తలపోస్తూ, పాంట్ జేబు లోంచి చిల్లర తీయడానికి లేచి నుంచున్నాడు. మళ్ళీ బల్ల "కిఱ్ఱు" మని చేసిన శబ్దానికి షాపతను తలెత్తాడు.

చిల్లర ఏమీ దొరక్క పోవటంతో ఒక నిమిషం తటపటాయించి రెండు రూపాయల నోటు తీసి యిస్తూ "ఒక సోడా" అన్నాడు రవీంద్ర.

షాప్ అతను సోడా తేవటానికి వెనక్కి తిరిగేటంతలో పెద్ద శబ్దం చేస్తూ ఒక మోటర్ బైక్ వచ్చి ఆగింది షాప్ ముందర.

వెనక్కి తిరిగిన వాడు కాస్తా "రాంబాబుగారా! ఏవిటి ఈ రోజు మా అదృష్టం, యిలా వచ్చారు? తమరి స్నేహితు లెవ్వరూ లేరే వెంట? బావున్నారా! నేను పంపలేదని కేసెట్ల కోసమే వచ్చుంటారు కదూ." అంటూ తలా, తోకా లేకుండా ప్రశ్నలూ, జవాబులూ కూడా తానే చెప్పుకుంటూ బయటకు వచ్చాడు.

అటు చూసాడు రవీంద్ర. తన వయసు వాడే. బైక్ మీద ఒక కాలు ఆన్చి నిల్చున్న తీరులో నిర్లక్ష్యం. డబ్బుతో వచ్చిన హుజం కన్పిస్తున్నాయి. మాటల్లో నిర్లక్ష్యం.

షాప్ అతను ఒక గోల్డ్‌స్పాట్ తెచ్చి అందించాడు అతనికి.

అలాగే తనకి సోడా యిస్తాడేమో అనుకున్నాడు రవీంద్ర. అతను యివ్వకపోగా వచ్చిన అతనితో మాటల్లో పడిపోయాడు.

మాటల్లో వారిద్దరు ఫ్రెండ్సు అనీ, యితను కొట్టు పెట్టుకోవటానికి అతడు సాయ పడ్డాడనీ అర్థం అయింది రవీంద్రకి.

ఫ్రెండ్ వచ్చిన హడావుడిలో మర్చిపోయాడేమోనని గుర్తు చేసాడు రవీంద్ర. "ఏమోయ్ సోడా" అంటూ.

షాప్‌వాడు తల కూడ తిప్పి చూడ్లేదు.

"అవునూ.... రాంబాబూ.... మీరు మొన్న పంపిన కేసెట్లు పెట్టాను. చాలా బావున్నాయి. వచ్చిన జనం అంతా అడిగారు ఆ మ్యూజిక్ ఎక్కడ చేయించావు? అని... ఆ రెండు రోజులూ కిక్కిరిసి పోయిందనుకోండి, నా షాపు జనంతో..." చెప్తున్నాడు షాపతను.

"ఏవిటీ.... యింతకీ నా కేసెట్లు అరిగి పోయాయి అంటావు. అవునా? అసలే నాకెంతో యిష్టమైన మ్యూజిక్ అది. వెస్ట్రన్ మ్యూజిక్ నా ప్రాణం, తెలుసుగా నీకు!" దర్పంగా అంటున్నాడు అతను.

"అమ్మమ్మా.... ఎంత మాట! అది కాదూ...." అంటూ యింకా ఏదో చెప్పబోతున్న అతనిని మధ్యలో ఆపుతూ, "ఏమోయ్. నీకే చెప్పేది" అంటూ పళ్ళాడు నాలుక పిడచ గడుతున్న రవీంద్ర.

షాపతనయితే వెనక్కి తిరగ లేదు కానీ రాంబాబు వెనక్కి తిరిగి చూసాడు.

అతని చూపుకి చాలా ఫీల్ అయాడు రవీంద్ర. తన వయసు వాడి ముందే అలా పదే, పదే, అడగటం సిగ్గని పించింది రవీంద్రకి.

చాలా ఇన్‌సల్ట్‌గా ఫీల్ అయ్యాడు అతను.

తిరిగి చూసాడే కానీ మళ్ళీ మాటల్లో పడ్డాడు.... కాదు పడేసాడు రాంబాబు షాపతన్ని.

ఒక్కొక్కసారి అవతల వాళ్ళకి చాలా చిన్న విషయాలుగా కన్పించేవే, అనుభవించే వాళ్ళకి ప్రాణం పోతున్నట్టుగా ఉంటుంది.

వెనక్కి తిరిగి వెళ్ళి పోయేవాడే రవీంద్ర. కానీ అంతకు ముందే షాపతని చేతికి రెండు రూపాయల నోటు యిచ్చాడు. వాడు దాన్ని గల్లాపెట్టిలో భద్రంగా పడేసాడు అప్పుడే. దాన్ని అడిగితే యివ్వక పోగా తిట్లు లంకించు కోవచ్చు. యిటు సోడా అని యింకోసారి అడగాలంటే మొహమాటం. పోనీ వదిలేసి వెళ్ళిపోదామా అంటే అతని మధ్య తరగతి మనస్తత్వం వొప్పటం లేదు.

ఇంకో రెండు నిమిషాలకి అతనికి లీలగా అర్థం అయిందేమంటే వాళ్ళిద్దరూ కావాలని తనని పట్టించుకోవట్లేదు అని. ఏడ్పిస్తున్నారని.

రెండు రూపాయలు నా దగ్గర ఉన్నాయి. ఎక్కడికి పోతాడులే అని షాపు వాడి ధీమా! అవతల వాడు యిబ్బంది పడుతూంటే, అదీ తన వలన పడుతున్నాడంటే చూసి సంతోషించే శాడిస్ట్ మెంటాలిటీ గల రాంబాబుకి యితన్ని క్రీగంట చూస్తూంటే అదో రకమయిన ఆనందం.

పరిస్థితి అర్థం అయిపోయింది రవీంద్రకి.

హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చి కొంచెం గట్టిగా అన్నాడు రవీంద్ర. "అరె.... యిందాక నీకిచ్చిన నోటు మధ్య చిల్లుందే. మారుతుం దంటావా?" అడిగాడు అమాయకంగా.

మాట్లాడుతున్న వాడు ఆపి, "అమాయక చక్రవర్తీ! చెప్పక పోతే చచ్చేవాడ్ని కదయ్యా నోటుతో" అనుకుంటూ వెనక్కి తిరిగి గల్లాపెట్టె తీసి నోటు చూపిస్తూ, "యిదేనా ఎక్కడ?" అన్నాడు షాపతను.

"ఇలాతే.... చూపిస్తా" అంటూ అందుకున్న రవీంద్ర నోటు జేబులో పెట్టుకుని కామ్‌గా బయటికి నడిచాడు.

అప్పటివరకు ఒక గేమ్ ఆడుతున్నా మన్నంత సంతోషంతో ఉన్న యిద్దరికీ, ఎవరో చెప్పుతో "ఫెడీ"మని కొట్టినట్టయింది పాపం. □

# ధర్మపథం | విద్వాంసుని లక్షణం

పాండిత్యం ఉన్న వారికి అహంభావం అధికమని సాధారణంగా కొందరు అంటారు. ఇది కొంత వరకూ యధార్థమే కావచ్చు. కాని యధార్థమైన విద్వత్తు కల వారు ప్రశాంతంగానే కాన వస్తారు. ఇతరులని అధిక్షేపించడం, తిరస్కార భావంతో చూడడం మిడిమిడి జ్ఞానం కల వారి స్వభావం.

విద్వాంసుల లక్షణం చక్కని ఉదాహరణతో ·కూడా ఎన్నడో ఇలా చెప్పబండి.

"గుణ దోషౌ బుధో గృహ్ణన్
ఇందు క్ష్వేళా వివేశ్వరః,
శిరసా ధార్యతే పూర్వం
పరం కంఠే నియచ్ఛతి."

అమృతం కోసం దేవ దానవులు పాల సముద్రాన్ని మథించినప్పుడు, మొదట ఉత్పన్నమైన హాలాహల విషాన్ని- సర్వ లోక రక్షణార్థం మహేశ్వరుడు, ఒక గుళికగా చేసికొని మ్రింగి కంఠంలోనే ఉంచుకున్నాడు. తర్వాత సముద్రంలో జనించిన చల్లని చంద్రుణ్ణి తలపై నిలుపుకున్నాడు. ఇట్లు చేసి, ఆ దేవ దేవుడు ఉత్తమ విద్వాంసులకు ఆదర్శమైనాడు.

అసంపూర్ణమైన విద్య నేర్చిన వారు, తాము మహా విద్వాంసులమని చెప్పుకుంటూ ప్రజలను మోస పుచ్చి ధనం సంపాదించవచ్చును. వారిని చూడగా, ఉత్తమ విద్వాంసులకు కొంత అసంతృప్తి కలగడం సహజం. అయినా, వారు ఆ మోసగాండ్రకు ఎట్టి అపకారాన్నీ తలపెట్టరు. "ఎలాగో బ్రతకనీ" అని, వారిలో లోపాలను బయటికి వెల్లడించ కుండా గొంతుకలోనే అణచి వేసి, ఏ మాత్రం పాండిత్యం ఉన్నా, దానిని ప్రశంసిస్తారు.

ఆ పండితులు, తమ పట్ల దాక్షిణ్యం చూపుతూ మహా విద్వాంసులు తమ పాండిత్యమును ప్రశంసిస్తున్నట్లు గ్రహించక, తాము సర్వజ్ఞులమనియే భావిస్తారు. వీరి స్వభావం అసలు విద్వాంసుల స్వభావానికి విరుద్ధంగా ఉంటుంది. వీరు ఇతరుల గుణ గణాలను ప్రశంసించకుండా కంఠంలో ఉంచుకొనే, వారిలో అణు మాత్రం లోపం ఉన్నా గోరంతను కొండంత చేసి దుష్ప్రచారానికి పూనుకుంటారు.

ఉత్తమ విద్వాంసుల స్వభావాన్నే మనం అలవరించుకోవాలి. ఎవరిలో నయినా మంచి వుంటే దానిని మెచ్చుకోవాలి. చెడ్డ గుణాలుంటే ఊరుకోవాలి గాని వానిని ప్రచారం చెయ్యడం సముచితం కాదు.

-బులుసు వేంకటరమణయ్య

